


ఆడదే అయితే, సన్నగా, నాజూగ్గా, లతలా ఉంది అనొచ్చు. మగాడు కాబట్టి, సన్నగా రివటలా ఉన్నాడు అనక తప్పలేదు. సన్నగా రివటలా ఉన్నా అందగాడు కావచ్చు. కాని ఇతడేమో గూని ఉందా అన్న అనుమానం వచ్చేలా నడుముని భుజాల దగ్గర కాస్త వంచుతాడు.

కళ్లకున్న గోల్డ్ ఫ్రేమ్ కళ్లద్దాలు, పొందికగా అమర్చుకున్న మీసం, ఒంటిమీద టెరిలిన్ బుష్ షర్టు, లేటెస్ట్ ఫేషన్‌లో మాస్టర్ టైలర్‌చేత కుట్టబడ్డ పంట్లాం, పాలిష్‌తో నిగనిగా నల్లగా మెరుస్తున్న బూట్లు, అతడికి అందగాడన్న బిరుదుని ఇవ్వలేకపోయేయి.

చేతిలోని జిప్ సంచీని ఇటూ అటూ ఊపుతూ అన్నాడు, "ఈ వెధవ బస్సు ఒకనాడూ టైముకొచ్చి ఏడవదు !" అతడు మాటాడినపుడు అపస్వరాలతో కొంగ కూత పెట్టినట్టే ఉంది—నోరు విప్పేసరికి ముందుకున్న పారపళ్లు రెండూ, కొంగ ముక్కులా ముందుకు తోసుకొచ్చేయి. ఉమ్మి తుంపర్లగా స్ప్రే అయింది!

ఆ జల్లు నించి తప్పించుకొని, రెండో వ్యక్తి, "కొత్తా ? ఎప్పుడూ ఉన్నదేకదా ?" అంటూ బెక బెక లాడేడు. కప్పకీ ఈ మనిషికీ ఉన్న పోలికలు ఏమిటి ? అని ప్రశ్న వేస్తే ఐదో క్లాస్ కుర్రాడేమంటాడంటే ... ఇతడి ముఖం కప్పముఖంలా వెడల్పు — కళ్లు కప్పకళ్లలా పైకి వచ్చేయి. నోరు కప్పనోరులా వెడల్పు, పెదవులు నాలికతో చప్పరించేటప్పుడు పైకివచ్చేది బంకవంటి లాలాజలంతో కప్పనాలిక ! అతడి ఒంటిమీద గరుకుగా కనిపించేది కప్పచర్మం !

అతడు పొట్టి, వలం, నలుపు — వీటికి సాయం పెద్దపొట్ట — నడచినపుడు కప్ప గంతులు వేసినట్టుంటుంది — తెలటి ఫుల్ చేతుల కమీజుని, నల్లటి టెరీకాటన్ పంట్లాంలో టక్ చేసి పటకా బెల్ట్‌తో బిగించి కట్టేడు జారిపోకుండా. కమీజుకి గోల్డ్ క్యాప్ కలం తగిల్చేడు. అతడి చేత ఒక చిన్న సంచీ ఉంది. మొసలి చర్మంతో చేసినట్టు గరుకుగా ఉంది—తొమ్మిదోనెల గర్భిణి స్త్రీలా ఉబ్బిపోయి ఉంది—అతడి బుగ్గనున్న పండయ్య సుబుద్ధి కేతకి కారామసాలా కిళ్లీ అతడి మెదడుకి మంచి నిషా ఇస్తోంది. మాటలు రువ్వుతూ, మధ్య మధ్యని, రక్తం కక్కినట్టు ఎర్రటి కిళ్లీ రసాన్ని ఉమ్ముతున్నాడు.

"బస్సు ఎక్కడయినా బ్రేక్ డౌన్ అయిందేమో కొంపతీసి" అన్నాడు మూడో మగాడు ! ఈ మనిషి వరాహావతారం ! ఆ అవతారంలో శ్రీమన్నారాయణుడు ఇలాగే ఉండి ఉండాలి ! చిత్రకారుడు, దేవుడు ఆ అవతారంలో పట్టుపీతాంబరాలు కట్టుకున్నట్టు చిత్రించినా దిగంబరుడే అయిఉండొచ్చు. కాని ఈమనిషి చెక్కులబుష్‌షర్ట్ తొడుక్కున్నాడు. చెక్కు చెక్కు గళ్ల పంట్లాం కట్టుకున్నాడు. చెమట చెలమలా ఊరిపోతోంది. చెమటకంపు బురద కంపులా ఆమడ దూరం కొడుతూ ఉండగా, ఆ దుర్గంధాన్ని కప్పిపుచ్చటానికి కునేగా సెంటు పులిమేడు !

అతడి ముఖం కోలగా, సూదిగా పంది ముఖంలా ఉంది! ఆ ముఖంలో ముఖ్యంగా అగుపడేవి పెద్ద నోరూ, ముక్కుపుటాలూ ! అతడి చేతిలో సంచీలేదుకాని ఒక ఫైలుంది. ఆ ఫైలు పై అట్టమీద అతడు ప్రభుత్వం యొక్క ఏ శాఖకి చెందిందీ ముద్రించి ఉంది, ఎలక్షన్ సైన్ బోర్డుమీద ఉండేటంత పెద్ద అక్షరాలతో ! అందరూ ఆ ఫైలుని చూసి, అతడి ప్రాముఖ్యతని గ్రహించి, పందిలా ఉన్నా ఇతడు వరాహావతారంలోని నారాయణుడంత శక్తిమంతుడే అన్న భ్రమలో పడుతున్నారు. అతడు మాట్లాడినప్పుడు పంది గుర్రు పెట్టినట్టుంది— అతడి ఫైలువల్ల వచ్చిన హోదాలో, గర్వం అతడి ముఖంలో తొణికిసలాడినా, ఆ గర్వం పందే గర్వం చూపితే ఎంత హుందాగా వుంటుందో అంతకన్న ఎక్కువ హుందాతనం ఇవ్వడం లేదు !

"బస్సు బ్రేక్ డౌన్ అయితే ఆ బస్‌ని అక్కడికలా వదిలేసి మెకానిక్ కోసం ఫోన్ చేస్తాడే తప్ప తను మాత్రం రిపేర్ చెయ్యడు ఈనాటి డ్రయివరు !" కొంగ, ఈనాటి లోక రీతిని వివరించి చెప్పేడు !

"ఎక్కడ చూడండి ! ఇన్ డిసిప్లిన్ తప్ప మరేమీ మిగల్లేదు!" కప్ప బెకబెకమన్నాడు

"ప్రతివాడూ పనిదొంగ సార్ ! ఎలాగ పనిని ఎగ్గొట్టి, ఊరకే డబ్బు గుంజుదాం అని చూడ్డం ఈనాటి కల్చర్ !" వరాహం భాష్యం చెప్పేడు, అతడొక్కడే పనిదొంగ కాడు అన్నందుకు చేతిలోని ఫైలు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలవగా !

"రెక్కలు ముక్కలు చేసుక పనిచేసినా ఏం లాభం సార్ ? ఎవరు గుర్తించాలి కనక ? 'అసలు పని' తెలీనివాడు ఎందుకూ పనికిరాడు !" కప్ప బెకారించేడు !

"మా బాగా చెప్పేరు !" అసలు పనంటే ఏమిటో అర్థమయినట్టు చిరునవ్వు నవ్వుతూ తందాన తానా అన్నాడు కొంగ.

తక్కిన వాళ్ళకి తన కర్థమయినట్టు అయిందో లేదో అన్న అనుమానం వచ్చి కప్ప టీకా తాత్పర్యం చెప్ప పూనుకున్నాడు "కాకి అరుపుంది చూసేరా ? కా... కా...? అదీ అసలు పని !" పకపకా నవ్వేడు తన తెలివికి తానే "ఒక్క బాస్‌నే కాదు ! ఇంటిదగ్గరుంటుంది అసలు బాస్! అమ్మగారు ! ఆమె అనుగ్రహం ముఖ్యం ! బజారు పని నించి, వాళ్ళ పిల్లల్ని స్కూళ్ళలో చేర్చడం వరకూ పనంతా నెత్తిన వేసుకోవాలి !"

"మీ కిందులో బాగా అనుభవం ఉన్నట్టుంది ! ?" వీరి మాటలు శ్రద్ధగా

## దొంగ

వింటున్న ఒక బస్సు పాంథుడు శిష్యుడు గురువుని అడిగినట్టుగా అడిగేడు.

"నాదంతా థియరీ ! దానిని నేను ప్రాక్టీస్‌లోనే పెట్టి ఉంటే ఏనాడో కారుల్లో తిరిగి ఉందును ! ఈ ఆర్‌టీసీ బస్‌కోసం నిలబడ్డం ఏంఖర్మ ?" అన్నాడు కప్ప, చిరుకోపం ప్రదర్శిస్తూ.

"మన నిజాయితీనే మన శత్రువుసార్ !" కొంగ కూత పెట్టేడు, తన చేతికున్న బంగారు ఉంగరాలు ముద్దు ముద్దుగా ముచ్చటగా చూసుకుంటూ !

"మహ బాహగా స్పెలవిచ్చేరు !" నవ్వునీ, మాటల్నీ కలిపి వరాహం అనేలోపున బస్ రానే వచ్చింది.

పెళ్ళినాడు కొత్తగానే ఉన్నా పిల్లలు పుట్టేక పాతబడి, పిట్నిపోయిన పాతసరుపులా ఉంది సిటీబస్సు పైకి ఉండలూ కాయలుగా ఎగతన్నిన పాత దూదిలా వేలాడుతున్నారు పాసింజరు. మాసిపోయి, చిరిగిపోయి, రంగుపోయిన దాని పైగుడ్డలా ఉంది బస్సుబాడీ ! ఏకించి, కొత్త కవరు వేయించడానికి డబ్బులేని బీదసంసారి ఆ పరుపుని అలానే వదిలేసినట్టు, రిపేర్ చేయించడానికి డబ్బులేకా, విరామంలేకా వదిలీసేరీ బస్సుని ఆర్‌టీసీ వారు. మనుషుల్ని మోసీ మోసీ మరి మొయ్యలేక ఏదోనాడు గుటుక్కుమంటే ముసలాడి శవాన్ని ఈడ్చి పారేసినట్టు స్క్రాప్‌యార్డులో పారేయొచ్చని నిర్ణయం చెయ్యబడ్డంవల్ల చేవ ఉన్నంతకాలం డబ్బు ఆర్జించి పెట్టనీ అని ఊరుకున్నారు.

అందరూ రోజంతా పనిచేసి, అలిసిపోయి ఇళ్ళకు పోతున్న పాసింజర్లే అవడాన, బస్సు ఆగీ ఆగగానే గాయంతో ఉన్న ముసలి ఎద్దు మీదికి కాకులు వాలినట్టు వాలేరు. వెనక నించి భూతం వెంటపడుతున్నట్టు, అప్పటికే మానవ శరీరాలతో కూరుకపోయినా, చీమ కాలుమోపడానికి చోటు లేకపోయినా, ఎలాగో ఓలా ఎక్కిపోయేరు ! ప్యాకెట్‌లో కూరిన అప్పడాల్లా ఒకర్నొకరు పత్తుక నిలబడ్డారు. కొందరు ఒకేకాలు ఫుట్‌బోర్డు మీద మోపి గజాని పట్టుక వేలాడితే, మరికొందరు మరో మనిషిని పట్టుక వేలాడుతున్నారు

నిండా బరువుపడ్డ ముసలి లొట్టిపిట్టలా ఒక పక్కకి ఒదిగిపోయింది బస్సు అందరూ ఎక్కేక "రైట్ ! రైట్ !" అన్నాడు కండక్టరు ! డ్రైవరు మొదటి గేరు వేసి, ఏక్సిలరేటర్ నొక్కి, క్లచ్ వదిలినా, బరువుతో ఉన్న బండిని లాగలేక ఎంత కొటినా కదలని ముసలిఎద్దులా బస్సు కదలేదు. పూర్తిగా ఎక్సిలరేటర్ నొక్కి శక్తినంతా ఇవ్వగా కదలేక కదల్లేక కదిలింది. "హమ్మయ్య ! కదిలింది!" పాసింజర్లు ఊపిరి తీసుకున్నారు !


ఓసారి కదిలేక వేగం పుంజుకుంది

"కదుల్తే ఆగదు! ఆగుతే కదల్దు!" అంటూ ఓ ప్రయాణికుడు జోక్ వేసేడు నవ్విదామని- ఎవ్వరూ నవ్వలేదు నవ్వే పరిస్థితిలో ఎవ్వరూ లేరు-

ఇంత ఇరుకులోనూ, పద్మవ్యూహంలోకి అభిమన్యుడు చొరపడినట్టు చొంపడి డబ్బులు వసూలు చేస్తున్నాడు కండక్టరు- "టికెట్ సార్ ! టికట్ !" అంటున్నాడు ఒక ప్రత్యేకమైన యాసలో. నోట్లు అందుకొని ఐదు వేళ్ళ మధ్యా వాటిని మడిచి పెడుతున్నాడు. భుజాన వున్న తోలు సంచీని గలగలలాడించి చిల్లర తీసి ఇస్తున్నాడు టికట్‌తో సహా. కొందరు పాసింజరు ఎక్కడికి పోవాలో చెప్పి టిక్కెటడుగుతే, మరి కొంతమంది తెలివి మీరినవారు "ఇరవై పైసలు" అంటున్నారు తమ స్టాపుకి టిక్కెట్టు ముప్పయి అయినా-

కొంగ తన సంచీలోంచి మంత్లీ టికెట్ తీసి చూపించేడు-

( 52 వ పేజీ చూడండి )



పై వా ర మే

'కోణార్క' శిల్ప చాతుర్యం

అశోకా పెన్స్ & బాల్ పెన్స్

అశోకా పాళీలు లాంగ్ లైఫ్ పాయింట్లతో తయారుచేయబడుచున్నవి.

అశోకా పెన్‌వర్క్స్, తెనాలి. (ఆంధ్ర)



అజీర్ణము


ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఔషధము కడుపులో వరిలేని సమయంలో, కడుపు ఉబ్బు, పళ్లని దేమ్పలు, మరియు విరేచనము సరిగా అవకుండుట మొదలైన వ్యాధులకు

విరేచనములకు

ఉపయోగంతో వహా లభిస్తుంది

వరములు బలహీనత, గుప్తరోగములకు

ఉత్తమ చికిత్స !



పెండ్లికి ముందు, పెండ్లి తర్వాత సంప్రదించండి.

Dr. Z. H. ROY
Govt Regd
Dr K. Kesava Rao (Govt Regd)

ఆసియా క్లినిక్

ఆర్.టి.సి. క్రాస్‌రోడ్

సంధ్య టాకీస్ ఎదుట,

హైదరాబాద్ - 500020.

కృష్ణాటాకీస్ వద్ద, కడప - 1.


# దొంగ

(18 వ పేజీ తరువాయి)

కప్ప కూడా అంతే చేసేడు—

ఒక చేతో ఫైలూ, రెండో చేతో బస్సుకున్న నిలువు గజంపట్టుక నిలబడ్డా వరాహం మాత్రం, "నాదీ మంత్లీ పాసే!" అన్నాడు జేబులో చెయ్యి పెట్టడానికి ఓపిక లేక -

"చూ పిం చం డి సార్ !" అన్నాడు కండక్టరు పట్టువదలని విక్రమార్కుడిలా.

మరి తప్పదు కాబట్టి, పాసు కోసం పట్పాం జేబులో చెయ్యి పెట్టాడు వరాహ మూర్తి - అతడి ముఖం ఫోకస్ తక్కువయిన ఫోటోలా వెలవెల బోయింది వెంటనే రెండో జేబు తడుముకున్నాడు. మరింత పాలి పోయింది ముఖం. లాల్చీ జేబులు తడుము కున్నాడు. సోషవచ్చి, తెలివి పోతున్నట్లు, తడి ఆరిపోయిన గొంతుతో అరచేడు... "పర్సు ! నా పర్సు !"

"ఏమయింది మీ పర్సు?" కొంగ శ్రేయోభిలాషించేడు.

"పోయింది! పర్సు పోయింది! నా పర్సు పోయింది !" గావుకేక పెట్టేడు వరాహం.

"పర్స్ పోయిందా ! బస్సు ఎక్కుతున్నప్పుడు ఎవడో కొట్టేసి వుంటాడు !" కప్ప బెకబెక లాడేడు, తన పర్సు బ్యాగ్‌లో వున్నందుకు అభినందించుకుంటూ !

"బస్సు ఎక్కేక జేబుని చెక్ చేసుకున్నా నండీ ! వుండింది ! దొంగ ఈ బస్‌లోనే వున్నాడు ! నా పర్స్ ఈ బస్‌లోనే వుంది! కండక్టర్‌గారూ ! బస్ ఆపి అందర్నీ చెక్ చెయ్యండి!" హుకుం జారీ చేసేడు తనకేదో పవరున్నట్లు.

"ఎంత వుందండీ పర్స్‌లో?" ఒకరి ప్రశ్న !

"నే చెప్పను ! చెప్పేస్తే దొంగకి పర్స్‌లో ఎంతుందో తెలిసిపోతుంది. ఆ పర్స్ తనదే నంటాడు ఎంతసొమ్ముందో చెప్పి! పర్స్ దొరికేక చెప్తాను ! అప్పుడు మీరు సొమ్ము లెక్కపెట్టొచ్చు !" వరాహం మెదడు సీమ చాకులా పనిచేసింది !

"హోల్డాన్! హోల్డాన్!" అంటూ విషల్ కొట్టేడుకండక్టర్ పెదవులలోంచి గాలివదిలి— "పాసింజర్లెవురూ కదలకండి బాబూ ! గేటుకాడ నిల్పొని ఒక్కొక్కర్ని దిగమని అందరి జేబులూ సెక్‌జేస్తాం ! ఎవ్వరూ తప్పు పట్టకండి ! యిది డబ్బుతో ఎవ్వారం ! ఇయాళీయన కయింది! రేపు తవరకవొచ్చు !" అంటూ ఓ చిన్న ఉపన్యాసం ఇస్తూ ఉండగా బస్సు ఊగి ఊగి, ఆగనా మానవా, ఆగనా మానవా అనుకుంటున్నట్లు బ్రేకు కొట్టగా కొట్టగా ఆగింది.

పాసింజర్లలో కొందరు "తప్పకుండా ! అలానే కానీండి !" అన్నారు మరికొందరు ఈ అంతరాయానికి విసుక్కున్నారు. "పోయిన పర్సు మరి దొరుకుతుందిటండీ మీ పిచ్చికాని ! " అంటూ పెదవులు విరిచారు కొందరు. "దొంగ లోనే ఉన్నా పర్సు ఈపాటికి బైటికి పోయేఉంటుంది!" అన్నాడొకాయన. అందరూ తమ జేబులు తడుముకున్నారు, తమ పర్సులున్నాయో పోయాయోనని ఆడవాళ్ళు హేండ్‌బ్యాగ్‌లు ఓసారిచూసి డబ్బు ఉందో పోయిందో చెక్‌చేసుకున్నారు.

బస్సు ముఖ్యమయిన దారిన వెళ్తూ ఉండడంవల్ల రోడ్డుమీద రద్దీ ఎక్కువగా ఉంది బస్సు ఆగగానే కండక్టరు కిందకి గెంతి ఒక తలుపు దగ్గర నిలబడ్డాడు. వరాహంకివినబడేలా అరిచేడు, "తమరు రెండో గేటుకాడ కాయండి !" "అలాగే !" అంటూ తన ఫైలు కొంగకి అందించి అతడు దిగటంలో పడ్డాడు. ఎవ్వరూ బస్సుదిగరాదని శాసించబడింది కాబట్టి, అతడు దిగడం ఆలస్యమయింది.

ఇంతలో...

పుట్టలోంచి పాము సరసరా బయటకు పోయినట్లు, ఒక పాతికేళ్ళ యువకుడు, బస్సు అనే ఈ పుట్టలోంచి సర్రున బయట పడ్డాడు. "ఏయ్ ! ఎవురు నువ్వు ! ఆగాగు! నీ పాకెట్ చెక్ సెయ్యనీ !" కండక్టర్ ఇంజన్ దగ్గరున్న ద్వారం దగ్గర్నించి కేక వేసేడు

వెనక ద్వారం నించి గెంతిన యువకుడు వినిపించుకోలేదు. దర్జాగాదిగి కాలరెత్తుకొని, నడిచి తక్కిన జనసమూహంలో రోడ్డుమీద కలిసి పోబోయేడు. అంతలో వరాహం బస్సులోంచి గెంతి, "ఏయ్ మిస్టర్ !

# కాంగ్రెస్ కేక్

కావల్సిన వస్తువులు :

తాజామైదా– 200గ్రా, పంచదార– 250గ్రా, గోవా–100గ్రా (లేక గులాబ్జాం పవుడర్ చిన్నపేకెట్), డాల్డా – 200గ్రా, యాలకులు – 5లేక6, (పొడి చేసిపెట్టుకోవలెను) మిఠాయి రంగులు– ఆకుపచ్చ, ఆరంజి (ఒక్కొక్కటి చిటికెడు కొద్దినీళ్లలో విడివిడిగా కలిపివుంచుకోవలెను)

తయారుచేయు విధానం :

బాణలిలో డాల్డావేసి బాగా వేడికాగానే క్రిందికిదించి అందులో మైదావేసి వేయించి కమ్మని వాసనరాగానే అందులో గోవావేసి బాగా కలిపి వుంచుకోవాలి. అందులో యాలకుల పొడివేయాలి. తర్వాత కంచు గిన్నెలోగాని దళసరిగావున్న స్టీలుగిన్నెలోగాని పంచదారపోసి కొద్దినీళ్లుపోసి స్టౌమీదపెట్టి తీగపాకంరాగానే కిందకిదింపి పెట్టుకొని, తయారుచేసి వుంచిన మైదా ముద్దను అందులోవేసి చెయ్యివిడనకుండా కలపాలి. ఆ గిన్నెవేడికే గట్టిపడుతూ వస్తుంది. గట్టిపడే తరుణంచూచి దాన్ని మూడు భాగాలు చేసుకుని ఒక భాగంలో కలిపివుంచు కొన్న ఆకుపచ్చరంగు నీళ్ళుపోసి బాగా కలిపిన తర్వాత ఒక పళ్ళానికి నెయ్యిరాసి అందులో వేసి బాగా నెరపవలెను. దానిపై రెండో భాగాన్ని తెల్లదేవేసి నెరపవలెను. దానిపై మూడో భాగాన్ని ఆరంజి రంగునీళ్లు పోసి బాగా కలిపి దానిపై నెరపవలెను. చల్లారిన తర్వాత కేకులుగా కోసి తీయవలెను. కేకులు కాంగ్రెస్ జెండా "షేపు"లో చూడ ముచ్చటగా, రుచిగా వుంటాయి.

— డి. నాగరత్నమ్మ

---

ఆగగు!" అన్నాడు... కాని "ఏకే దొంగ!" అనడానికి సాహసించలేకపోయేడు!

ఎందుకంటే...

ఆ యువకుడు స్టెప్ కటింగ్–క్రాపుతో, అందంగా పెంచుకున్న మీస సంపత్తితో, తెల్లని బెల్‌బాటమ్ పంట్లాంలోకి టక్ చెయ్యబడ్డ పాలిస్టర్ కమీజుతో, మీద ఒక బొత్తాము వదిలీగా మెడలో ధగధగా మెరుస్తున్న ఒంటిపేట బంగారు గొలుసుతో, కాళ్ళకి ఎత్తు మడమల జోడుతో, చేతికి ఎలిక్ట్రానిక్ వాచీతో యూనివర్సిటీ స్టూడెంట్లా వున్నాడు. హిందీ సినీమాలోని లేటెస్టు హీరోలా వున్నాడు.

అతడు వినిపించుకోకుండా పారిపోతూ వుండగా, వరాహం వదల్లేదు. వేదాలని ఎత్తుకపోయిన రాక్షసుడ్ని వరాహమూర్తి వెంట పడ్డట్టు వెంటపడి. ."ఏమండోయ్! అతడ్ని ఆపండి!" అంటూ రోడ్డుమీద పాంథులకి కేకపెట్టి తను పరుగున ఆ యువకుణ్ణి సమీపించబోగా, ఆ యువకుడు పరుగు తీసేడు. ఇంక సందేహం ఏముంది?! "దొంగ! దొంగ! పట్టుకోండి వాడ్ని!" అంటూ కేకపెట్టేడు వరాహం– తన శక్తి నంతా కూడతీసుక పరుగు తీసేడు.

రోడ్డు దాటబోయిన ఆ యువకుడు,అటు నుంచి రెండు డబల్ డెక్కర్లు ఒకదానివెంట ఒకటి రావడంతో ఆగవల్సి వచ్చింది. ఆగినా రోడ్డుకి నిలువుగా పరుగు తియ్యడానికి ఉద్యుక్తుడవుతున్న సమయానికి, కండక్టరు చిచ్చిందీలా రెండోవేపునించి దూసుకవచ్చి ఆ యువకుడికి అడ్డుగా నిలబడి కాలర్ దొరక బుచ్చుకున్నాడు.

అంతే! వరాహం వచ్చి ఒకపక్క నిలబడి అతడి నడుముచుట్టూ రెండు చేతులూ బిగించేడు! (తన ఫైలు కప్పకి అందించేడు బస్సు దిగుతూనే!)

రోడ్డుమీద నడుస్తున్న జనమే కాక పాసింజరంతా చుట్టూ మూగగా, బయట పడే మార్గం తోచక ఆ యువకుడి ముఖంలో తెగింపు కనిపించింది. జేబులోంచి సరాలున మడిచివున్న చాకుతీసి దాన్ని నోటితో విప్పి, వరాహం చేతిమీద పొడవబోగా అతని చేతిమీద ఫెడేల్‌మని గొడుగు కర్రతో కొట్టేడో ప్రయాణీకుడు. చాకు నేలని పడింది.

అంతే! అందరూ ఆ యువకుడిమీదకి లంఘించేరు. ఇంక రుజువేం కావాలి? ఒకడా యువకుడి జుత్తు పట్టుక గుంజి ముఖంమీద ఫెడీమని కొట్టేడు. మరొకడు పిడికిలి బిగించి వెన్నెముకమీద పొడిచేడు. ఇంకొందరు అతడి షర్టుని పరపరా చింపిపారేసేరు. ఎవడి కిష్టమొచ్చినట్టు వాడు చెయ్యి చేసుకోడం ప్రారంభించేరు. ఇన్నాళ్ళూ జేబు దొంగల గురించి సైన్ బోర్డులు చూడ్డమేగాని ఎదురుగా చూడకపోవడంవల్ల, ఇవాళ ఎదురుగా కనపడ్డమేకాక దొరికిపోవడం వల్ల ఆ దొంగని మరి లేకుండా చేస్తే లోకంలో మరి దొంగలే ఉండరన్న మనస్తత్వం మూకకి వచ్చింది. శివాలు లెత్తిపోయేరు.

"చంపండి దొంగవెధవని" "ప్రతి దొంగ గాడిదకొడుకూ బెల్‌బాటమూ,ఎత్తుమడిమల జోడూవేసేసుకొని హీరోలాపోజుకొట్టటం... పిలుదొరగ్గానే కేటుగాడిగా మారడం!" "ఏంరా దొంగరాస్కెల్! దుక్కలా ఉన్నావు! నీకేంపోయేకాలంరా? పని చేసుకోరాదటా?" "ఇది బాబూ ఈనాటి యువతరం! వీళ్ళు శ్రమపడతారా? బాబులు ఆర్జించింది ఖర్చు పెడతారు! ముష్పత్తుగా తింటారు! అమ్మాయిల వెంటపడతారు!" "వీళవల్లే మానభంగాలెక్కువయ్యేయి!" "దొరకనంత వరకూ హీరో! దొరుకుతే విలను!" "పచ్చడి చెయ్యండి ... కొడుకుని!"

ఇష్టమొచ్చినట్టు తిడుతూ,చేతికొచ్చినట్టు మూగిన ప్రజంతా కొట్టడం ప్రారంభించేరు. ఆ యువకుడి జుత్తు పీకుకపోయింది. ముఖం నించి దెబ్బలవల్ల రక్తం కారుతోంది. మెడలోని నకిలీహారాన్ని ఎవరోతెంపుకపోయేరు. చేతికున్న వాచీని మరోరు విప్పకపోయేరు. షర్టు తునాతునకలయింది. తెల్లటిపంట్లాం నిండా మట్టిమరకలు అంటుకున్నాయి. కాని అతడు కిమ్మనలేదు నోరు మెదపలేదు. కళ్లంట నీరు కార్చలేదు. కళ్ళలో దీనత్వం లేదు, ఈ లోకంమ్మీద క్రోధంతప్ప!

"అయ్యా! ఇదుగో ఇదేనా మీ పర్సు?" అంటూ పెద్ద వలంపటి పర్సుని ఆ యువకుడి జేబులోంచి పీకి అందించేడు ఒక ప్రయాణికుడు.

అప్పుడా యువకుడు కోపంగా అన్నాడు... "ఎంతుందో చెప్పండి అందులో!"

"దొంగగాడిదకొడకా! ఇంకా నీ పొగరణగ లేదురా?" కప్ప తన చేతనున్న సంచీతో యువకుడి ముఖంమీద కొట్టేడు.

అప్పుడు కండక్టరు అడ్డొచ్చేడు... "ఆగండిసార్! ఆ పర్స్ తనదని రజా

చెయ్యండి! ఏంచేస్తుంది ?" వరాహాన్ని అడిగేడు.

వరాహం కాస్త ఇబ్బందిగా ఇటూ అటూ చూసి... "ఆ పర్సులో రెండు వేలుంది!" అన్నాడు.

కండక్టర్ పర్సు అందుకొని, విప్పి చూసేడు. వందరూపాయల నోట్లు! లెక్క పెట్టేడు. సరిగ్గా ఇరవై వున్నాయి! అవిగాక రెండు రూపాయల చిల్లర నోట్లున్నాయి!

"ఎక్కడిది మీకంత డబ్బు!" దెబ్బలు తింటున్న యువకుడు వదలకుండా అడిగేడు కసిగా.

"ఎక్కడిదా? నీ బాబు ఇచ్చేడా స్కౌండ్రల్!" ఎడాపెడా కొట్టేడు ముఖం మీద వరాహం! అతడి కళ్ళలో ద్వేషం!

"దొంగతనం చేసేవ్! కూనీ చెయ్యబోయేవ్! తిరగపడతావు కూడానా!" మళ్ళా అందరూ కలియపడ్డారు. ఆ దెబ్బలకి నేల కూలేడా యువకుడు. రక్తం పెదాల నుంచి కారుతోంది. శరీరమల్లా బాధతో కంపిస్తోంది.

"ప్రావిడెంట్ ఫండ్ లోన్ పెట్టుకుంటే ఇవాళ దొరికింది! అబ్బాయికి ఒడుగు!" పర్సు అందుకుంటూ అన్నాడు వరాహం.

ఇంతలో విషిల్ కొట్టుకుంటూ పోలీసులు వచ్చేరు, వారి వెనువెంటనే సైరన్ వేసుకుంటూ పోలీస్ పెట్రోల్ కారొచ్చింది.

# దొంగ

కండక్టర్ దొంగని అప్పగించేడు సంగతి వివరించి.

ఆ యువకుణ్ణి పట్టుకున్నారు పోలీసులు. "నేను దొంగను కాను! నేను దొంగను కాను! ఐ ఏమ్ నాట్ ఏ థీఫ్! అది మా డబ్బు!" ఆ యువకుడు ఆవేశంతో అరిచేడు. మూక మళ్ళా విజృంభించబోగా, పోలీసులు వారిని అటకాయించి, తామే నాలుగు అంటించేరు లాఠీలతో. పెట్రోల్ వ్యాన్లోకి కుక్కేరు. "మీరూ రండి సార్!" అన్నారు వరాహాన్ని.

"పదండి! మేం కూడా మీతో వస్తాం!" అన్నారు కొంగ, కప్ప.

ఆ యువకుడితో పాటు ఆ ముగ్గురూ పోలీస్ వాన్ ఎక్కేరు సైరన్ వేసుకుంటూ దొంగతో సహా జీపు ముందుకు దూసుకపోయింది.

అదే రోజు ఉదయం పది గంటల సమయం అప్పుడు...

*    *    *

వివిధ ప్రభుత్వ కార్యాలయాలు తెరుచుకున్నాయి, ప్రజలకు సేవ చెయ్యడానికి. ఎందరెందరో ఆఫీసరు, గుమాస్తాలు, గుట్టలు గుట్టలుగా ఫైళ్ళు! ఏ గుమాస్తా ఏకాగితం చూస్తాడో ఎవరికి తెలీదు. ప్రజలకీ, గుమాస్తాలకీ మధ్య బ్రోకర్లు. ఆఫీసర్లకీ గుమాస్తాలకీమధ్యఒప్పందాలు, అండర్‌స్టేండింగ్‌లు.

అది ఆర్. టి. ఓ. ఆఫీసు. అక్కడ లారీలకి, కార్లకీ, మోటారు సైకిళ్ళకీ, బస్సులకీ రూట్ పెర్మిట్లు, టేక్సీ పెర్మిట్లు, ఇవ్వబడతాయి. డ్రయివింగ్ లైసెన్సులు ఇవ్వబడతాయి. రెన్యువల్స్ జరపబడతాయి. ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓనర్‌షిప్పులు జరపబడతాయి.

ఒక సీటుముందు కొంగ కూర్చున్నాడు. చకచకా పెర్మిట్లు తయారు చేస్తున్నాడు ఆఫీసరుగారి సంతకాలకి. మధ్యవర్తులు సంచులు పట్టుకవస్తున్నారు, వెళ్తున్నారు. డబ్బు సీటు కింద నుంచి చేతులు మారుతోంది! సాయంత్రం ఆఫీసు మూసేసరికి కొంగ పట్టుకున్న జిప్ సంచీ వలంగా తయారయింది. పది రూపాయలకన్నా ఎవరూకొనని ఆ పాతసంచీని ఇప్పుడు పదివందలకన్నా కొనడానికి వెనుకాడరు, అందులో ఏముందో తెలిసినవారు!

*    *    *

"పదో తారీఖుకి రెండు బెర్తులు కావాలి సార్!"

"లేవండి!" కప్ప బెక బెక లాడేడు.

"పోనీ ఈ నెలలో ఏ తారీకుక్కున్నా ఆ తారీఖుకివ్వండి!" ఉదయం ఆరుగంటలకే వచ్చి లైన్లో నిలబడ్డ కాబోయే ప్రయాణీకుడడిగేడు.

"ఈ నెల ఏ తారీకున కూడా లేవండి!" కప్ప నిర్మొహమాటంగా చెప్పేడు.

"అలాగంటే ఎలాసార్! అర్జంటుగా వెళ్ళాలి తప్పదు! రిజర్వేషన్ లేకుండా ప్రయాణం అంటే ఏమిటో మీకు తెలీదనకనా?"

"నన్నేంచెయ్యమంటారు?"

ఆ ఆసామీకాస్త సందేహించి చిన్నగొంతుతో అన్నాడు... "బెర్తుకి పది ఉంచుకోండి!" వందకాగితం, రిజర్వేషన్ దరఖాస్తు తోసేడు.

"పదిహేనుకి తగ్గడంకాదు... పదిహేనుకి రెండు కేన్సిలేషన్స్ ఉన్నాయి! ఓకే! మీ అదృష్టం!" అంటూ వంద కాగితం తీసుకున్నాడు.

సాయంత్రం అయ్యేసరికి అతడి సంచీ పొంగింది...

*    *    *

"మూడేళ్ళయింది సార్ పేరు రిజిస్టర్ చేసుకొని! ఇంతవరకూ ఒక్క కాలన్నా



హిందీనటుడు శతృఘన్‌సిన్హాకి యిటీవల కవల పిల్లలు పుట్టారు. వాళ్ళిద్దర్నీ—తల్లిదండ్రులని పై ఫొటోలో చూడవచ్చు. ఈ పిల్లలికి "లవకుశు"లని పేరు పెడతానని "శతృఘన్" అన్నాడట!



'చల్లాసిస్టర్సు'గా ప్రసిద్ధి కెక్కిన సోదరీమణులలో కుమారి జయలలిత, ప్రప్రథమంగా 'భామాకలాపం'లో భామగా రంగస్థల ప్రవేశం చేసింది గుంటూరు భారతీయ విద్యాభవన్‌లో– యిటీవల కార్యక్రమంలో కుమారి జయలలిత, కుమారి శ్రీలక్ష్మి ప్రదర్శనలు యిచ్చారు.

---

రాలేదు! ఇప్పుడు అసిస్టెంట్ పోస్టులకి పేరు పంపమని ఆ కంపెనీవాళ్ళు మీకు రాసినట్లు తెలిసింది– దయచేసి పంపితే!'' ఆ యువకు డన్నాడు–

''మూడేళ్ళైనా అయింది? ఆరేళ్ళూ, పదేళ్ళూ అయి రిజిస్టర్ చేసుకున్న వాళ్ళున్నారు!'' వరాహమూర్తి నిర్వికారంగా అన్నాడు.

''ఇరవై వేకెన్సీలున్నాయట సార్! బి.కామ్ వాళ్ళు కావాలని రాసేరుట! కనీసం మీరు వంద పేర్లన్నా పంపొచ్చు! మా నలుగురి పేర్లూ అందులో చేరికించండి సార్! మేమంతా ఎం. కాం. కూడా పాసయి కూర్చున్నాం! ఆరేళ్ళక్రితం రిజిస్టర్ చేసుకున్నవాళ్ళకీసరికి ఉద్యోగాలు దొరికే ఉంటాయ్! రేపే ఆఖరుతేదీ సార్ పేర్లు మీరు పంపడానికి! పరీక్ష ఎలానూ వాళ్ళు పెడతారు! తరవాత మా అదృష్టం! మీ మేలు మరిచిపోం సార్!'' పొలిస్టర్‌షర్టు, బెల్‌బాటమ్ పంట్లాం వేసుకున్న కుర్రాడన్నాడు– ఉన్న రెండు జతల మంచి బట్టలూ తనే ఉతికి ఇస్త్రీ చేసుకుంటాడు. ఇవి చిరిగిపోతే నాన్న మరి కొత్తవి కుట్టించ లేడు. చేతికున్న క్వార్ట్‌జ్ రిస్టువాచీ ఒక కలిమిగల స్నేహితుడుది. మెడలోని గొలుసు రోల్డ్‌గోల్డ్‌ది. కాలికున్న ఎత్తుమడమల జోళ్ళూ ఎరువువే. ఈ వేషం లేందే యువతరంలో తను సమాన ఫాయీలో మనలేడు! నిరుద్యోగన్న ముద్ర పడిపోయిన తనకి ఈ బట్టలు కొద్దిగా పరపతిని నిలబెడుతున్నాయి.

''ఈ లోకంలో గ్రేడ్యుయేట్లు కుక్క మురికి! దొరకంది ఉద్యోగం మాత్రం! ఎవడు చదవమన్నాడు బి. కాం...ఎం. కాం? చదువులేని లక్షలమంది ఎలా బ్రతుకు తున్నారు? మీరూ అలానే బ్రతకండి! గ్రేడ్యుయేట్ అవగానే ఉద్యోగం తే అని ప్రభుత్వపు పీకలమీద కూర్చుంటే అయి పోతుందా?'' ఫిలాసఫీ మాట్లాడేడు.

ఇంతలో ఒక మధ్యవర్తి మధ్యనదూరేడు. యువకుడ్నీ అతడి అనుచరులనీ, పక్కకి తీసుకువెళ్ళేడు. మంతనాలు సాగించేడు. పేరు పంపడానికి పేరు ఒక్కింటికీ వెయ్యి! పైసలు కాదు! రూపాయలు! ఎక్కడ్నుంచి తేవడం వెయ్యి!? ఈ ఛాన్స్ పోతే వయసొకటి మీద పడిపోతోంది! మరి ఛాన్సులు రావు! వంద ఇవ్వగలం! ఏభైమిదికి తగ్గదు! రెండొందలకన్న ఇవ్వలేం! ఆఖరికి మధ్యవర్తికి వందా, వరాహమూర్తికి ఐదొందలూ పేరుకి– యువకులు నలుగురూ అప్పు గురించి పరుగెత్తేరు. తమ డిగ్రీలను తాకట్టుపెట్టి రూపాయికి నెలకి పది పైసలు వడ్డీ చొప్పున డబ్బు తెచ్చేరు, చెల్లించేరు– పేర్లు వెళ్ళేయి.

కాని డబ్బు తమది! ఈ వరాహమూర్తికి ఏం హక్కుంది దానిమీద? వరాహమూర్తి పర్సుని తన విరగా పెట్టుకొని అతడి వెంట పడ్డాడా యువకుడు...!

* * *

''ఎవుడు దొంగో, ఎవుడు దొరో తెలీని మాయదారి రోజులొచ్చినయ్!'' కండక్టర్ బస్సు ఎక్కుతూ అన్నాడు!

''బాగా చెప్పేరు!'' అన్నాడు తన గొడుగు విరగనందుకు సంతోషిస్తూ, దాంతో ఆ యువకుడ్ని బాదిన ప్రయాణీకుడు!

''రైట్! రైట్!'' అన్నాడు కండక్టరు ఈల గట్టిగా వేసి–

బస్సు ముసలి లొట్టి పిట్టలా ముందుకు కదిలింది!